క్లుప్తంగా

దరఖాస్తుల ఆహ్వానం

గోవిందరావుపేట: మండలంలోని చల్వాయి మోడల్ స్కూల్ జూనియర్ కాలేజీలో ఫిజిక్స్ లెక్చరర్ పోస్టుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ గుండు కుమార్ యాదవ్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తొమ్మిది, పదో తరగతితోపాటు ఇంటర్మీడియట్ తరగతులు బోధించుటకు ఫిజిక్స్ లెక్చరర్ పోస్టు కోసం ఎంఎస్సీ(ఫిజిక్స్) బీఈడీ అర్హత కలిగిన అభ్యర్థులు దరఖాస్తులు జూన్ 5 వరకు చేసుకోవాలని తెలిపారు. జూన్ 6న ఇంటర్వ్యూలు నిర్వహించి ఎంపిక చేయనున్నట్లు పేర్కొన్నారు. వేతనం నెలకు రూ.18200 ఇవ్వనున్నట్లు తెలిపారు. పూర్తి వివరాలకు 80963 50115 నంబర్‌ను సంప్రదించాలి తెలిపారు.

అందుబాటులో జీలుగ విత్తనాలు

వెంకటాపురం(కె): మండల కేంద్రంలోని సొసైటీ కార్యాలయంలో రైతులకు కావాల్సిన జీలుగ విత్తనాలు అందుబాటులో ఉన్నాయని మండల వ్యవసాయ అధికారి నవీన్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కావాల్సిన రైతులు పట్టాదార్ పాస్ పుస్తకం, ఆధార్ కార్డు జిరాక్స్‌ను తీసుకు వచ్చి జీలుగు విత్తనాలు తీసుకోవాలని తెలిపారు. 30 కేజీల బస్తా రూ.2137 అని తెలిపారు.

బాధ్యతల స్వీకరణ



వెంకటాపురం(కె): మండల తహసీల్దార్‌గా మేడా వేణు గోపాల్ మంగళవారం బాధ్యతలు చేపట్టారు. లక్ష్మీరాజయ్యను భూపాలపల్లి జిల్లాకు బదిలీ కావడంతో ఆయన స్థానంలో కన్నాయిగూడెంలో విధులు నిర్వర్తించే వేణుగోపాల్ వచ్చారు.

తహసీల్దార్‌కు సన్మానం



సన్మానిస్తున్న నాయకులు

కన్నాయిగూడెం: మండల తహసీల్దార్‌గా సర్వర్ బాధ్యతలు చేపట్టడంతో కాంగ్రెస్ మండల నాయకుడు అధ్యక్షుడు అప్సర్ ఆధ్వర్యంలో మంగళవారం సన్మానించారు. కార్యక్రమంలో మండల ఇన్‌చార్జ్ జాడి రాంబాబు, యూత్ అధ్యక్షుడు నాగేష్, కుమ్మరి వెంకట్, జిల్లా నాయకుడు మాదాస్ రాజేందర్ ఉన్నారు.

అవార్డు గ్రహీతకు..



సుధాకర్‌ను సన్మానిస్తున్న అశోక్

గోవిందరావుపేట: మండలంలోని చల్వాయి గ్రామానికి చెందిన దళిత నాయకుడు గనపాక సుధాకర్‌కు రాష్ట్ర ప్రభుత్వం దళిత రత్న అవార్డును ప్రకటించింది. దీంతో మంగళవారం సుధాకర్‌ను కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్ ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా అశోక్ మాట్లాడుతూ.. దళిత సేవకులను గుర్తించి ప్రతీ సంవత్సరం రాష్ట్ర ప్రభుత్వం అంబేడ్కర్ జయంతి సందర్భంగా దళిత రత్న అవార్డులను ప్రకటించడం జరుగుతుందన్నారను. అందులో భాగాంగానే ఈ సంవత్సరం సుధాకర్‌కు రావడం చాలా సంతోషంగా ఉందన్నారు. అనిల్ యాదవ్, జంపాల ప్రభాకర్ పాల్గొన్నారు.

స్థల సేకరణలో జాప్యం

- జీపీ కార్యాలయాల నిర్మాణానికి గ్రహణం
- ఏళ్లు గడుస్తున్నా ప్రారంభం కాని పనులు
- పాఠశాలలు, ప్రభుత్వ భవనాల్లో నిర్వహణ

వెంకటాపురం(కె): పంచాయతీ కార్యాలయ భవనాల నిర్మాణానికి నిధులు మంజూరై సంవత్సరాలు గడుస్తున్నాయి. స్థల సేకరణతో జాప్యంతో పనులు మాత్రం ప్రారంభం కావడం లేదు. మండలంలో తొమ్మిది పాత పంచాయతీలు ఉండగా కొత్తగా ఏర్పడిన తొమ్మిది పంచాయతీలు ఏర్పడ్డాయి. పాత పంచాయతీ భవనాల్లో కొన్ని శిథిలావస్థకు చేరుకున్నాయి. కొత్త పంచాయతీ భవనాలతో పాటు శిథిలావస్థలో ఉన్న భవనాలకు ప్రభుత్వం నుంచి ఒక్కో పంచాయతీకి రూ.22లక్షల నిధులు మంజూరయ్యాయి. కాగా అధికారుల నిర్లక్ష్యం కారణంగా పంచాయతీ భవన నిర్మాణ పనులకు పునాదులు పడలేదు. దీంతో కొత్త పంచాయతీల నిర్వహణ పాత ప్రభుత్వ భవనాలు, కమ్యూనిటీ హాళ్లు, ప్రభుత్వ పాఠశాలల్లో నిర్వహిస్తున్నారు. 2022 సంవత్సరంలో రాచపల్లి, బీసీ మల్లిగూడెం పంచాయతీ భవన నిర్మాణ పనులు ప్రారంభించారు. కాని స్థల వివాదంతో ప్రారంభ దశలోనే పనులు నిలిచి పోయాయి. పంచాయతీ కార్యాలయాల నిర్మాణానికి రెవెన్యూ అధికారులు ప్రభుత్వ స్థలం చూపించక పోవడంతో కొన్ని పంచాయతీల పనులు ప్రారంభం కాలేదు. మరికొన్ని పంచాయతీల నిర్మాణానికి పనులు చేసేందుకు కాంట్రాక్టర్లు ముందుకు రాక పోవడంతో పనులు ప్రారంభించ లేదని అధికారులు తెలుపుతున్నారు. ఇప్పటికైన అధికారులు పంచాయతీ భవన నిర్మాణాలకు స్థలం కేటాయించి భవన నిర్మాణ పనులు ప్రారంభమైయ్యేలా చర్యలు చేపట్టాలని మండల ప్రజలు కోరుతున్నారు.



ప్రభుత్వ భవనంలో నిర్వహిస్తున్న బీసీ మల్లిగూడెం పంచాయతీ కార్యాలయం

పనులు ప్రారంభిస్తాం..



మండలంలో కొత్తగా ఏర్పాటైన తొమ్మిది పంచాయతీలకు ఉపాధిహామీ నిధులు, ఐటీడీఏ నుంచి నిధులు మంజూరయ్యాయి. పంచాయతీ భవన నిర్మాణాలకు ప్రభుత్వ స్థలం లేక పోవడంతో పనులు ఆగిపోయాయి. కొన్ని భవనాల నిర్మాణానికి కాంట్రాక్టర్లు రావటం లేదు. భవన నిర్మాణాలకు స్థలం సేకరించి పనులు ప్రారంభిస్తాం..

- రాజేంద్ర ప్రసాద్, ఎంపీడీఓ

సమస్యల పరిష్కారానికి కృషి

- కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రఘు

ఏటూరునాగారం: మండలంలోని రాయబంధం వెళ్లే గ్రామంలోని జూరివాగు, గొత్తికోయగూడెంలోని సమస్యలను పరిష్కరించే విధంగా ప్రభుత్వం కృషి చేస్తుందని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రఘు అన్నారు. మంగళవారం మండలంలోని రాయిబంధం, చిన్నబోయినపల్లి గ్రామాలను కాంగ్రెస్ పార్టీ నాయకులు సందర్శించి సమస్యలను తెలుసుకున్నారు. చిన్నబోయినపల్లి గ్రామంలో ఎన్నో సంవత్సరాల పోడు భూమి సమస్యను మంత్రి సీతక్క దృష్టికి తీసుకెళ్లామన్నారు. భూముల్లో పండ్ల మొక్కల సాగుకు రైతులు, అటవీశాఖ అంగీకారం తెలిపినట్లు పేర్కొన్నారు. 150 ఎకరాల భూమి 63 మంది రైతులతో సాగు చేయనున్నట్లు తెలిపారు. దాని కోసం రోడ్డు సైడ్ ట్రెంచ్ కొట్టి మొక్కలు పెంపకం చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. అలాగే చిన్నబోయినపల్లిలో సీసీ రోడ్డు పనులను రఘు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వినయ్, మహమ్మద్, రాజేష్, ఠాగూర్, సమ్మయ్య, వెంకన్న, మల్లారెడ్డి, ప్రశాంత్, శ్రీను, రమేష్, మౌలానా, రాములు పాల్గొన్నారు.



జూరి వాగును పరిశీలిస్తున్న నాయకులు

కార్మికులకు కనీస వేతనం చెల్లించాలి

మంగపేట: కేంద్ర ప్రభుత్వం మధ్యాహ్న భోజన వంట కార్మికులకు కనీస వేతనం చెల్లించాలని మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జంపాల రవీందర్ డిమాండ్ చేశారు. ఆ సంఘం మండల జనరల్ బాడీ సమావేశం మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో గడ్డం భారతి అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రవీందర్ మాట్లాడుతూ.. పాఠశాలల వంటకార్మికుల విషయంలో కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరి ఏమిటో తెలుపాలని డిమాండ్ చేశారు. నెలకు కేవలం రూ.600 వేతనాలను చెల్లిస్తు శ్రమ దోపిడీకి గురి చేస్తుందని ఆరోపించారు. రేషియో ప్రకారం వేతనాలు చెల్లిస్తే మొత్తం రూ.8000 రావలసి ఉంటుందన్నారు. యూనియన్ నాయకులు రాజకుమారి, పద్మ, జయమ్మ, సమ్మక్క, తులసి, ఫయాంబీ, షఫియాబీ, అఖిల, దివ్యభారతి, సమ్మక్క, కుమారి, సుశీల, సమ్మక్క, వెంకటరమణ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రవీందర్

నిబంధనలు పాటించకుంటే చర్యలు

- ఏడీఏ శ్రీపాల్

కాటారం: ఫెర్టిలైజర్ దుకాణాలు యజమానులు, విత్తనాలు విక్రయించే డీలర్లు వ్యవసాయశాఖ నిబంధనలు పాటించి విక్రయాలు సాగించాలని లేకుంటే చర్యలు తప్పవని మహదేవపూర్ వ్యవసాయశాఖ ఏడీఏ శ్రీపాల్ హెచ్చరించారు. మహాముత్తారం మండలం బోర్లగూడెం రైతు వేదికలో మంగళవారం ఫెర్టిలైజర్ దుకాణాల యజమానులు, విత్తన విక్రయ డీలర్లతో సమావేశం నిర్వహించారు. విత్తనాలు, ఎరువులు, పురుగుల మందులు విక్రయాలపై పలు సూచనలు చేశారు. వానాకాలం సీజన్ ప్రారంభం అవుతున్న నేపథ్యంలో రైతులకు నాణ్యమైన విత్తనాలు మాత్రమే విక్రయించాలని సూచించారు. విత్తనాలు కొనుగోలు చేసిన రైతుకు తప్పని సరిగా బిల్లు ఇవ్వాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ఏఓ అనూష, ఏఈఓలు శివకృష్ణ, శశివర్ధన్, ప్రవళిక, యజమానులు, డీలర్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏడీఏ శ్రీపాల్

ప్రశంస పత్రం అందజేత



ప్రశంస ప్రతం అందజేస్తున్న ఎస్పీ శబరీశ్

ఎస్ఎస్‌తాడ్వాయి: ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి పని తీరును గుర్తించి జిల్లా కేంద్రంలోని పోలీస్ కార్యాలయంలో ఎస్పీ శబరీశ్ మంగళవారం ప్రశంస ప్రతం అందజేశారు. ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి విధి నిర్వహణలో క్రమశిక్షణతో బాధ్యతగా విధులు నిర్వర్తించడం, నేరాలను అదుపు చేయడంతోపాటు మండలంలో ఎమైనా ఘటనలు చోటుచేసుకుంటే సకాలంలో స్పందించి సేవలు అందిస్తున్నాడు. ప్రజలలో మమేకమైన వారి సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తున్నాడు. ఆయన పనితీరు, సేవలను గుర్తించి ఎస్పీ ప్రశంస ప్రతం అందించారు. డీఎస్పీ రవీందర్ సూచనలు, సలహాల మేరకు సిబ్బందితో సమన్వయంగా పని చేయడంతోనే పని తీరుపై గుర్తింపు లభించిందని ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. గుర్తించి ప్రశంస పత్రం అందించిన ఎస్పీకి కృతజ్ఞలు తెలిపారు.

నేడు మండల స్థాయి అధికారుల సమావేశం

వాజేడు: వర్షాకాలంలో చేపట్టాల్సిన కార్యాచరణపై నేడు(బుధవారం) మండల స్థాయి అధికారులతో సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీఓ శ్రీకాంత్ నాయుడు పేర్కొన్నారు. మండల ప్రత్యేకాధికారి సర్దార్ సింగ్ వర్షాలు, వరదలపై సలహాలు, సూచనలు ఇవ్వనున్నట్లు తెలిపారు. అధికారులు వారి శాఖల ద్వారా చేపట్టబోయే ప్రణాళికలతో ఉదయం 11 గంటలకు హాజరు కావాలని కోరారు.

వ్యాధి నిరోధక టీకాలు

వాజేడు: మండల పరిధిలోని బీజీనేపల్లి, మొరుమూరు గ్రామాల్లో మంగళవారం ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌లో భాగంగా వ్యాధి నిరోధక టీకాలను వైద్యాధికారి గ్నానస ఆధ్వర్యంలో వేశారు. మిషన్ ఇంద్ర ధనుస్సులో భాగంగా టీకాలు వేసుకోని వారిని గుర్తించి టీకాలు వేశారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్ వైజర్ కోటిరెడ్డి, ఏఎన్ఎమ్ కన్యాకుమారి, ఆశకార్యకర్తలు అరుణ, లక్ష్మితో పాటు తదితరులు ఉన్నారు.



టీకా వేస్తున్న వైద్య సిబ్బంది

వరంగల్‌కు తరలిరావాలి

చిట్యాల: పద్మశ్రీ అవార్డు తీసుకుని వరంగల్‌కు వస్తున్న ఎమ్మార్పీఎస్ వ్యవస్థపకుడు మందకృష్ణ మాదిగకు స్వాగతం పలకడానికి జిల్లాలోని ఎమ్మార్పీఎస్, అనుబంధ సంఘాల నాయకులు అధిక సంఖ్యలో తరలిరావాలని ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకుడు, భూపాలపల్లి జిల్లా ఇన్‌చార్జ్ మంద వెంకటేశ్వర్లు మాదిగ కోరారు. మంగళవారం మండల కేంద్రంలో అంబేడ్కర్ సెంటర్ వద్ద ఆయన మాట్లాడుతూ.. హనుమకొండలోని కాళోజీ కళాక్షేత్రంలో ఎమ్మార్పీఎస్, అనుబంద సంఘాల జాతీయ కార్యవర్గ సదస్సు నిర్వహించన్నుట్లు తెలిపారు. ఈ సందస్సును విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్పీ ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు బొల్లి బాబు మాదిగ, గాజుల భిక్షపతి మాదిగ, దొర్నాల రాజేందర్, నేరేళ్ల ఓదేలు, ఎర్ర భద్రయ్య పాల్గొన్నారు.

స్వాగత కార్యక్రమానికి తరలిరావాలి

కాటారం: పద్మశ్రీ అవార్డు గ్రహీత మంద కృష్ణమాదిగ ఈ నెల 31న వరంగల్ రాక సందర్భంగా ఏర్పాటు చేసిన స్వాగత కార్యక్రమానికి మండలంలోని ఎమ్మార్పీఎస్ శ్రేణులు, మాదిగ కులస్తులు అధిక సంఖ్యలో తరలిరావాలని ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు మంతెన చిరంజీవి తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో చిరంజీవి మాట్లాడారు. భారత అత్యున్నత పౌర పురస్కారమైన పద్మశ్రీ అవార్డు అందుకొని మొదటి సారిగా వరంగల్‌కు వస్తున్న మంద కృష్ణమాదిగకు ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ఘన స్వాగతం పలకడం జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో ఎమ్మార్పీఎస్ నాయకులు మంతెన శ్రీధర్, మంతెన కరుణాకర్, సంతోష్ పాల్గొన్నారు.



చిట్యాల: మాట్లాడుతున్న మంద వెంకటేశ్వరరావు

ఎంపీ వ్యాఖ్యలు సరికావు

మల్హర్: సరస్వతి పుష్కరాల్లో పెద్దపల్లి ఎంపీ వంశీకృష్ణ చేసిన వ్యాఖ్యలు సరికాదని కాంగ్రెస్ పార్టీ ఎస్సీసెల్ జిల్లా చైర్మన్ రమేశ్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ధనం కన్న కులమే గొప్పదని తనపై వివక్ష చూపుతున్నారని పేర్కొనడం అర్థరహితమన్నారు. ఎన్నికల్లో కులాలకు అతీతంగా నాయకులు సమష్టిగా శ్రమించడంతోనే ఎంపీగా గెలిచారనే విషయాన్ని గుర్తించుకోవాలని పేర్కొన్నారు. సీనియర్లను పక్కనబెట్టి ఏకచత్రాధిపత్యం సాధించే విధంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు.

మహిళా ఆరోగ్య కేంద్రంలో వైద్యపరీక్షలు



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

వెంకటాపురం(కె): మండల కేంద్రంలోని మహిళా ఆరోగ్య కేంద్రంలో మంగళవారం వైద్యాధికారి జ్యోతి ఆధ్వర్యంలో మహిళలకు వైద్య పరీక్షలను నిర్వహించారు. ఈ సందర్భంగా 87 మందికి పరీక్షలు నిర్వహించి వారి వద్ద నుంచి రక్త నమూనాలను సేకరించారు. అనంతరం వారికి మందులను అందజేశారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు వినయ్, పవన్, హెచ్ఈఓ సత్యనారాయణ, హెల్త్ సూపర్ వైజర్ యాకలక్ష్మితో పాటు తదితరులు ఉన్నారు.

కొనసాగుతున్న ఇంటర్వ్యూలు



ఏటూరునాగారం: ఇంటర్వ్యూలు చేస్తున్న అధికారులు



మంగపేటలో..



వాజేడు: ఇంటర్వ్యూలకు వచ్చిన దరఖాస్తుదారులు

వాజేడు: రాజీవ్ యువ వికాసం పథకానికి దరఖాస్తులు చేసుకున్న అభ్యర్థులకు రెండో రోజు మంగళవారం మండల కేంద్రంలో ఎంపీడీఓ కార్యాలయంలో అధికారులు ఇంటర్వ్యూలను నిర్వహించారు. 600 మందికి ఇటర్వ్యూలు నిర్వహించి డీసీసీబీ, ఎస్‌బీఐ బ్యాంకు మేనేజర్ల సమక్షంలో విడివిడిగా ఎంపిక ప్రక్రియను చేపట్టారు.

ఏటూరునాగారం: మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం రెండో రోజు రాజీవ్ యువ వికాసం కింద దరఖాస్తు చేసుకున్న వారికి ఇంటర్వ్యూలను నిర్వహించినట్లు ఎంపీడీఓ రాజ్యలక్ష్మీ తెలిపారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు పేర్లను పరిశీలించి వారి వివరాలను తెలుసుకున్నామన్నారు. సంబంధిత బ్యాంక్ అధికారులు లబ్ధిదారుల పేర్లను పరిశీలించారని వివరించారు. అదేవిధంగా బుధవారం కూడా ఇంటర్వ్యూలు ఉన్నట్లు ఆమె తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు రమాదేవి, లక్ష్మీ నారాయణ పాల్గొన్నారు.

మంగపేట : మండలంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ భద్రునాయక్ ఆధ్వర్యంలో మంగళవారం రాజీవ్ యువ వికాస్ దరఖాస్తుదారులకు ఇటర్వ్యూలు నిర్వహించారు. ఇంటర్వ్యూలకు హాజరైన దరఖాస్తుదారుల లీస్టును కలెక్టర్‌కు పంపించనున్నట్లు ఎంపీడీఓ తెలిపారు.

నేడు కమలాపురం లబ్ధిదారులకు

మండలంలోని కమలాపురం ఎస్‌బిఐ బ్యాంక్ పరిధిలోని కమలాపురం గ్రామ పంచాయతీ పరిధిలోని రాజీవ్ యువ వికాస్ పథకం కోసం దరఖాస్తు చేసుకున్న దరఖాస్తుదారులకు ఎంపీడీఓ కార్యాలయంలో నేడు(బుధవారం) ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ తెలిపారు. ఉదయం 10 గంటలకు దరఖాస్తుదారులు హాజరుకావాలని తెలిపారు.



కన్నాయిగూడెంలో..

కన్నాయిగూడెం: రాజీవ్ యువ వికాస్‌కు బ్యాంక్‌ల నుంచి క్లియరెన్స్ ఉండాలని మండల ప్రత్యేక అధికారి, ఈజీఎస్ ఏపీడీ వెంకటనారాయణ, ఎంపీడీఓ అనిత అన్నారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో ఎంపీడీఓ అనిత ఆధ్వర్యంలో బ్యాంక్ అధికారులు, మండల పంచాయతీ అధికారులు రాజీవ్ యువ వికాస్ లబ్ధిదారులకు మంగళవారం ఇంటర్వ్యూలు నిర్వహించారు.

ప్రమాదకరంగా కల్వర్టులు

- ఇబ్బంది పడుతున్న ప్రయాణికులు
- పట్టించుకోని అధికారులు

టేకుమట్ల: మండలంలోని పలు గ్రామాల్లోని ప్రధాన రోడ్లకు నిర్మించిన లోలెవల్ కల్వర్టులు ప్రస్తుతం శిథిలావస్థకు చేరుకుని ప్రమాదకరంగా మారాయి. ప్రధానంగా చిట్యాల-టేకుమట్ల ప్రధాన రహదారిలో నాలుగు లోలెవల్ కల్వర్టులు నిత్యం భారీ వాహనాల రాకపోకలతో పూర్తిగా శిథిలమయ్యాయి. పగలు, రాత్రి అనే తేడా లేకుండా నిత్యం వాహనాల రాకపోకలతో రద్దీగా ఉండే ప్రధాన రహదారిలోని కల్వర్టులు ధ్వంసమైన అధికారులు పట్టింకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. నిధులు కేటాయించి, శంకుస్థాపన చేశారు కాని నిర్మాణాలు చేపట్టడం లేదని వాహనదారులు వాపోతున్నారు. టేకుమట్ల శివారులోని టేకులకుంట వద్ద గల కల్వర్టు వర్షాకాలంలో వరదకు మరింత ధ్వంసం కాగా కల్వర్టు దాటే క్రమంలో ప్రమాదాల భారిన పడుతున్నారు. అలాగే కస్తూరిబాగాంధీ బాలికా విద్యాలయం సమీపంలోని కల్వర్టు మధ్యలో గుంతలు పడడంతో నిత్యం ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. శాంతినగర్ శివారులో ఉన్న కల్వర్టు ప్రమాదకరంగా ఉండడంతో ప్రయాణికులు ఆందోళన చెందుతున్నారు.

జారుతున్న అంకుషాపూర్-టేకుమట్ల లోలెవల్ కల్వర్టు

పొలాల నుంచి వచ్చే వరద నీటితో అంకుషాపూర్-టేకుమట్ల లోలెవల్ కల్వర్టుపై పాకురు నిండుకుని వాహనదారులు ప్రయాణించే సమయంలో జారుతోంది. దీంతో వాహనదారులే కాకుండా కాలినడకన వెళ్లే వారు సైతం జారి పడుతున్నారు. అక్కడ హైలెవల్ కల్వర్టు నిర్మించాలని గతంలో చాలా సార్లు అధికారులకు, పాలకులకు మొరపెట్టుకున్నా నిర్మించలేదు. ప్రస్తుతం టేకుమట్ల-నవాబుపేట ప్రధాన రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు కావడంతో కల్వర్టులను హైలెవల్ కల్వర్టులుగా నిర్మిస్తే మెరుగైన రవాణా సౌకర్యం కొనసాగుతుంది.

వర్షాకాలంలో రవాణా కష్టమే..

వర్షాకాలం ప్రారంభం అవుతుండడంతో ఈ సంవత్సరం కూడా కల్వర్టు కష్టాలు తప్పవని వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. సుబ్బక్కపల్లి, అంకుషాపూర్, సోమనపల్లి గ్రామస్తులు పరకాల పట్టణానికి నిత్యం వాహనదారులు టేకుమట్ల నుంచి మొగుళ్లపల్లి మీదుగా వెళ్తుంటారు. అలాగే మండల కేంద్రం నుంచి ఆర్టీసీ బస్సులు చిట్యాల మీదుగా వెళ్తుంటాయి. కావున వాహనదారుల సౌకర్యార్థం లోలెవల్ కల్వర్టులను హైలెవల్ నిర్మించాలని మండల ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.



ప్రమాదకరంగా ఉన్న టేకుమట్ల-చిట్యాల ప్రధాన రోడ్డులోని లోలెవల్ కల్వర్టు



టేకుమట్ల-అంకుషాపూర్ ప్రధాన రోడ్డులో..

కల్వర్టులపై పట్టింపు లేదు

మండలంలోని లోలెవల్ కల్వర్టులపై అధికారులకు, పాలకులకు పట్టింపు లేదు. వర్షాకాలంలో వరదలతో రవాణా స్థంభిస్తుంది. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైన పాలకులు, అధికారులు స్పందించి లోలెవల్ కల్వర్టుల వద్ద హైలెవల్ కాల్వర్టులు నిర్మించి ప్రయాణికులకు ఇబ్బంది లేకుండా చూడాలి.

- దానవేని ఓదెలు, అంకుషాపూర్

కళాశాలకు భవనం మంజూరు చేయాలి

వెంకటాపురం(కె): మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలకు నూతన భవనం మంజూరు చేయాలని కోరుతూ.. ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు సోడి అశోక్ తహసీల్దార్ వేణు గోపాల్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జూనియర్ కళాశాల విద్యార్థులకు సొంత భవనం లేక పోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు, ఫీజు రియంబర్స్‌మెంట్ తక్షణమే విడుదల చేయాలని కోరారు.



వినతిపత్రం అందజేస్తున్న అశోక్